ఇది వీఐపీ రోడ్డు.. పారుతోంది మురుగు!




ఉదయం కార్యాలయం పక్కన ఉన్న నాగమయ్యకుంట వద్ద పారుతున్న మురుగు

రాంనగర్ నుంచి వీఎస్‌టీ చౌరస్తాకు వచ్చే దారిలో మూడేళ్లుగా మురుగు పరుగు

- వీఐపీలు, ప్రజాప్రతినిధులు నిత్యం వచ్చిపోయే రోడ్డు ఇది
- సమస్యకు పరిష్కారం చూపాలని నాగమయ్యకుంట వాసుల వేడుకోలు
- అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మేం మనుషులం కాదా... మాకు హక్కులు లేవా... మాకు రావా రోగాలు అని ప్రశ్నిస్తున్నారు నాగమయ్యకుంట బస్తీ వాసులు. మూడేళ్లుగా ఎండా కాలం, వానా కాలం, శీతాకాలం అని కాకుండా నిత్యం డ్రైనేజీ మురుగు నీటితో అక్కడి ప్రజలు సాహసం చేస్తున్నారు. రాంనగర్ నుంచి వీఎస్‌టీ చౌరస్తాకు వచ్చే రహదారిలోని ఉదయం ఆఫీసు పక్కన ఉన్న నాగమయ్యకుంట బస్తీవాసులకు ఇదే ప్రధాన సమస్య. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గుండా వీఐపీలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేటర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు చివరికి రాంనగర్‌లో ఉండే హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ సైతం వెళ్తారు. అయినా అక్కడ నిత్యం ప్రజలు డ్రైనేజీతో ఇబ్బందులు పడుతూనే ఉన్నాయి. వాళ్లు చూసుకుంటూ పోతారు కానీ పట్టించుకోరని స్థానికులు చెబుతున్నారు. ఆ ప్రాంతమంతా మురికి కూపంగా మారి దోమలు, ఈగలతో సాహసం చేస్తున్నారు.

◆ అనేక మంది పిల్లలు, పెద్దలు డెంగీ, మలేరియా వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికి కొంత మంది ఆస్పత్రుల్లో ఉన్నారని అక్కటి ప్రజలు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తే కేవలం డ్రైనేజీ నీటిని తొలగిస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపించడం లేదని ఆరోపిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్‌లను డ్రైనేజీ లోపల కూలిపోయి పైపులైన్‌లన్ని బ్లాక్ అయ్యాయని వారు వాపోయారు. రోడ్డుకు అవతల వైపు ఉన్న పాత లైన్‌ను బ్లాక్ చేయడం వల్ల డ్రైనేజీ అంతా పొంగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త పైపులైన్‌లు వేస్తున్నామని చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు వేయలేదని అంటున్నారు. వర్షం పడితే మొకాళ్లలోతూ నీరు వస్తున్నాయి. ఎలా భరించేది అని వాపోతున్నారు. ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు వచ్చి వెంటనే చేస్తామని చెబుతున్నారు కానీ ఏ ఒక్కరూ పరిష్కరించలేదు.

ఎంత మందికి విన్నవించినా...

◆ ఎంతో మందికి ఇక్కడి సమస్యను పరిష్కరించాలని మెమొరాండం ఇచ్చామని అయినప్పటికీ పరిష్కారం రాలేదని చెబుతున్నారు. ఒకానొక దశలో బస్తీ నుంచి 30 మంది ప్రత్యేకంగా బస్సును కట్టుకోని వాటర్ వర్క్స్ అధికారి వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఇక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు లెక్కలేనన్ని సార్లు వినతిపత్రం ఇచ్చామని చేస్తున్నామని చెబుతున్నారు. తప్ప ఏ ఒక్కరూ పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మనుషులు ప్రయాణించే ప్రధాన రోడ్డు అని వారికి మా సమస్య కనిపించడం లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్వాసనను భరించలేకపోతున్నాం



ఇక్కడ మురుగు పారడంతో దుర్వాసనను భరించలేకపోతున్నాం. పడుకున్నా అదే వాసన వస్తోంది. వంటలు చేసుకోని తినేటప్పుడు కూడా మురికి వాసనతో కంపుకోడుతున్నాయి. ఇప్పటికైనా మా బాధను గ్రహించి పరిష్కరించాలి.

– లింగమ్మ, స్థానికురాలు

మూడేళ్లుగా భరిస్తున్నాం



మూడేళ్లుగా దుర్వాసనను భరిస్తున్నాం. అక్కడి నుంచి పోయే వారు ముక్కుమూసుకొని పోతున్నారు. 30 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొత్త లైన్‌లు వేస్తామని చెబుతున్నారు. కానీ వేయడం లేదు. వెంటనే అధికారులు స్పందించాలి.

– వీరేందర్

మెమొరాండం ఇచ్చాం



ఇది వీఐపీలు ప్రయాణించే ప్రధాన రహదారి. వాటర్ వర్క్స్ అధికారి వద్దకు బస్తీ వాసులంతా పోయి వినతిపత్రం అందించాం. ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు పదుల సంఖ్యలో విన్నవించాం. అనేక సార్లు వారి ఇంటికి కూడా పోయాం. ఉన్నతాధికారులు కూడా ప్రయణించే రోడ్డు ఇది. ఏ ఒక్కరూ కూడా మాపై కనికరం చూపడం లేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలి.

– యాదగిరి

దోమలగూడ డీఐగా వెంకటేష్

చిక్కడపల్లి: నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వుల మేరకు దోమలగూడ డీఐగా వెంకటేష్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ డీఐగా పనిచేసిన వరప్రసాద్ బదిలీ అయ్యారు. అదే విధంగా ఇదే ఠాణాకు ఇద్దరు ఎస్సైలు ఎస్.కిషోర్, పి. నిరంజన్ రానున్నారు. అదేవిధంగా చిక్కడపల్లి ఎస్సైగా పనిచేసిన శశిపాల్‌రెడ్డి చార్మినార్ 6 జోన్‌కు బదిలీ అయ్యారు.

13న మందకృష్ణ మాదిగ విజయోత్సవ ర్యాలీ



అరుంధతినగర్‌లో మాట్లాడుతున్న నాగార్జున మాదిగ

చిక్కడపల్లి: ఢిల్లీ నుంచి ఎస్సీ వర్గీకరణ సాధించుకుని ఈనెల 13న నగరానికి అభినవ అంబేడ్కర్ మందకృష్ణ మాదిగకు రానున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అడపు నాగార్జున మాదిగ పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్‌మాదిగ ఆదివారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లో దీనిపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండికృష్ణ, మండపు శ్రీనివాస్, చిలక ఎల్లయ్య, పాపిడిరాజు, బొమ్మల రమేష్, రాజ్‌కుమార్, సురేష్ మాదిగ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి



మండపాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: ప్రశాంత వాతావరణంలో పండగలను నిర్వహించుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య కోరారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం గణేష్ మండపాల నిర్వాహకులతో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులకు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల అభ్యున్నతికి చేయూతనిస్తాం



గోల్నాకలో గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో సామాజిక భవనాల నిర్మాణానికి తనవంతు చేయూతను ఇస్తున్నని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ వాంబె కాలనీలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి సామాజికవర్గానికి కమ్యూనిటీహాల్ ఉండేలా చొరవ తీసుకుంటామని అన్నారు. గంగపుత్రుల అభ్యున్నతికి తనవంతుగా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు రంగస్వామి, కార్యదర్శి సుధాకర్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

అంబర్‌పేట: సామాజిక భవనలను సద్వినియోగం చేసుకొని ఐక్యతను చాటాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మండేపల్లి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ కమాలనగర్‌లో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పోరేటర్ కె.పద్మావతిరెడ్డిలు కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐకమత్యంగా ఉంటేనే సామాజిక హక్కులు, సమస్యలను పరిష్కరించుకొవచ్చని అన్నారు. గంగపుత్రుల అభ్యున్నతికి తనవంతు చేయూతను ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు మెట్టు సాయికుమార్, కాశిరామ్, సందిరి శ్రీనివాస్, మాల్ యాదగిరి, ప్రవీన్‌కుమార్, సింగితం సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీజీడీఎం ప్రోగ్రాంకు ఏఐయూ గుర్తింపు

ఐసీబీఎం–ఎస్‌బీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జరార్

బంజారాహిల్స్: ఐసీబీఎం–ఎస్‌బీఈ పీజీడీఎం ప్రోగ్రాంను అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ (ఏఐయూ) ఎంబీఏతో సమానంగా గుర్తించిందని ఐసీబీఎం–ఎస్‌బీఈ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ జరార్ తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీజీడీఎం కోర్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. క్యాంపస్‌లో ప్రస్తుతం 300 సీట్లు ఉన్నాయని రెండు సంవత్సరాల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వందశాతం ప్లేస్‌మెంట్ కల్పిస్తున్నామని తెలిపారు.

అభినందనలు

కాచిగూడ: శారీరక దృఢత్వంతో పాటు మనలో ఆత్మ విశ్వాసం పెంపొందడానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ సౌమ్య మిశ్రా అన్నారు. ఇటీవల బెంగళూర్‌లో జరిగిన 11వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీలలో జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన 19 మంది విద్యార్థులు పాల్గొని 34 బంగారు పతకాలు, 3 రజిత పతకాలు సాధించి చాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాచిగూడలోని ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించారు.

మున్సిపల్ క్వార్టర్స్ అధ్యక్షుడిగా ప్రభాకర్

కవాడిగూడ: దోమలగూడ మున్సిపల్ క్వార్టర్స్ బస్తీ అధ్యక్షుడిగా పానుగంటి ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఆదివారం బస్తీ చైర్మన్ పి. శాంతికుమార్ ఆధ్వర్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. లాల్‌బహదూర్ శాస్త్రీ కమ్యూనిటీహాల్‌లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పానుగంటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జె. నరేష్‌కుమార్, యూత్ అధ్యక్షుడిగా జె. శ్రీధర్‌రావు, యూత్ ప్రధాన కార్యదర్శిగా డి. మనోజ్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బీజేపీ నాయకుడు జి.వెంకటేష్, బీఆర్ఎస్ కవాడిగూడ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ అభినందించారు. మాజీ అధ్యక్షుడు కొమ్ము మల్లికార్జున్, కొమ్ము పాండు, ఎస్.కృష్ణ, ఎం.బాలమల్లేష్, పోచయ్య, ఎస్. యాదగిరి, కె.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి

మేరు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కీర్తి రాజగోపాల్



సంఘం ఎన్నికల సన్నాహాక సమావేశంలో మాట్లాడుతున్న కీర్తి రాజగోపాల్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆర్థికంగా.. సామాజికంగా.. రాజకీయంగా వెనుకబడిన మేరు కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని మేరు కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కీర్తి రాజగోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మేరు కుల సంఘం ఎన్నికల సన్నాహాక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కీర్తి రాజగోపాల్ హాజరై మాట్లాడుతూ.. మేరు కులస్తులు ఐక్యంగా ఉంటే ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు మన హక్కులను సాధించుకోగలమని అన్నారు. బేషజాలకు పోకుండా మేరు కులస్తులు అంతా ఏకమై ఒక తాటిపైకి రావాలని కోరారు.

ఆగస్టు 18న మేరు కుల సంఘం ఎన్నికలు

కుతంత్రాలకు స్వస్తి పలికి ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ మేరుకు ఆగస్టు 18న మేరు కుల సంఘం ఎన్నికలు జరుగుతాయని ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఆడప వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ తాల్ల వెంకటేశ్వరావు, ఉపాధ్యక్షులు గంగాకిషన్. డి. కొండ నర్సింగరావు, ఎస్‌బీ సంగెవార్, వెంకటేష్,సత్యనారాయణ, అన్ని జిల్లాల నుంచి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్యానెల్‌లోని సభ్యులందరూ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలి



మున్నూరుకాపు రాష్ట్ర స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న చల్లా హరిశంకర్

కాచిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు ప్రతి సంవత్సరం రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బర్కత్‌పురలోని సంఘం కార్యాలయంలో చల్లా హరిశంకర్ అధ్యక్షతన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్ కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో మున్నూరుకాపు విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణానికి 2 ఎకరాల స్థలం, రూ.5కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కోకాపేట్‌లో మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం రూ.20కోట్లు నిధులు కేటాయించాలన్నారు. మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో మున్నూరుకాపులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ వైస్‌చైర్మన్‌గా ఏబీ వేదప్రకాష్

కవాడిగూడ: కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ విభాగం వైస్‌చైర్మన్‌గా ఏబీ వేదప్రకాష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ చైర్మన్, హర్యానా మాజీమంత్రి అజయ్‌సింగ్ యాదవ్ ఆదివాకరం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేదప్రకాష్ మాట్లాడుతూ.... తనపై నమ్మకంతో రాష్ట్ర ఓబీసీ వైస్‌చైర్మన్‌గా నియమించినందుకు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో మీర్‌వహాజ్ ఆలీ ఖాన్

చిక్కడపల్లి: విద్యార్థులు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే శారీరక ధృడత్వానికి ఆత్మరక్షణకు దోహదపడుతుందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని అన్నారు. ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో తైక్వాండో మార్షల్ ఆర్ట్ మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ కలర్స్, బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్స్ కార్యక్రమంలో ఆమెతో పాటు తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి మీర్ వహాజ్ ఆలీ ఖాన్ పాల్గొని సర్టిఫికెట్లు పొందిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్‌సింగ్, మనీష్, రఘు, ఎన్.స్వామి, టిరాకేష్, డి.ప్రభు, క్రీడాకారులు పాల్గొన్నారు.

శుభ్రపర్చుకుందాం.. స్మరించుకుందాం.!

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను కడిగి పరిసరాలను శుభ్రపరిచిన నేతలు



సత్యానగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న గౌతంరావు

నల్లకుంట: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా'లో భాగంగా ఆదివారం నల్లకుంటలో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ అమృత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు సత్యానగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పాలు, నీళ్లతో శుభ్రం చేసి పూలమాలతో అలంకరించించారు. అలాగే తిలక్‌నగర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి పూలమాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిశోర్‌కుమార్, కేబీ. నర్సింగ్‌రావు, వెంకటేష్‌గౌడ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో..

అంబర్‌పేట: దేశ ఔనత్యాన్ని చాటేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగ పిలుపు మేరకు ఆదివారం డీడీ కాలనీలో స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ విగ్రహాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గౌతమ్‌రావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో దేశ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణగౌడ్, చుక్కజగన్, గోవర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, నాయిని బుచ్చిరెడ్డి, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలోని...

అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో బీజేపీ నేతలు హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, నాయకులు భూషన్‌చారి, అజయ్‌కుమార్, యశ్వంత్, ఈఎస్ ధనుంజయ, బాలు పాల్గొన్నారు.



తిలక్‌నగర్‌లో గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాలతో అలంకరించిన కార్పొరేటర్ అమృత



శ్రీరమణ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచిన బీజేపీ నాయకులు

లక్ష్మీఉప్పలమ్మ బోనాల వేడుకల్లో బీజేపీ నేత వినయ్‌కుమార్



భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్



బోనం.. తెలంగాణ ప్రాణం

ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో వైభవంగా శ్రావణమాస బోనాలు

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ఆదివారం బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. స్థానికంగా ఉన్న కట్టమైసమ్మ, నల్లపోచమ్మ దేవాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. మహిళలు బోనంతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నేత ముఠా జైసింహా, కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, దళిత మోర్చా నగర ఉపాధ్యక్షుడు కృష్ణ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్ అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు నర్సింగ్‌రావు అతిథులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కవాడిగూడ డివిజన్‌లో...

కవాడిగూడ డివిజన్ కోదండరెడ్డినగర్, ఎల్బీనగర్, చిత్రాలనగర్‌లో కనులపండువగా బోనాల వేడుకలు జరిగాయి. కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జీ. వేంకటేష్, పరిమళ్ కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, కేశవరాజు, నాయకులు రమేష్ బాబు, అనిల్ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

జవహర్‌నగర్ లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో..

చిక్కడపల్లి: బోనాల ఉత్సవాలను కలసి మెలసి జరుపుకోవాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని లక్ష్మీఉప్పలమ్మ దేవాలయంలో శ్రావణ బోనాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఆలయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కోశాధికారి ఎంఎస్‌పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, నగరకాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, సీనియర్ నాయకురాలు గుర్రం చంద్రకళలు, గుర్రం గణేష్, నేతలు, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, ఉమేష్, శివకుమార్, ఆనంద్‌రావు, అఖిలేష్, ఆలయ కమిటీ సభ్యులు పద్మావతి, రాధా, ప్రసన్నలక్ష్మీ, ఎస్.భానుమతి, విజయకుమార్, సతీష్, ముకేష్‌లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేత గుర్రంశంకర్, సంజీవరెడ్డి, పవన్‌కుమార్



కవాడిగూడ డివిజన్ బోనాల ఉత్సవంలో కార్పొరేటర్ రచనశ్రీ, వెంకటేష్, పరిమళ్ కుమార్